

పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ షిండే



దోమకొండలో ప్రచారం నిర్వహిస్తున్న విప్ గంప గోవర్ధన్, భారీగా తరలివచ్చిన ప్రజలు



బాన్సువాడలో ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న పోచారం శ్రీనివాసరెడ్డి, భారీగా తరలివచ్చిన ప్రజలు



లింగంపేట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జాజాల సురేందర్

## బీఆర్ఎస్ ధూంధాం

బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. నిత్యం జనంలోనే ఉంటూ చేసిన అభివృద్ధిని.. మ్యానిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందడంతో ప్రచారానికి వెళ్లిన అభ్యర్థులకు ప్రజలు నీరాజనం పడుతున్నారు. సోమవారం పోచారం శ్రీనివాసరెడ్డి, జాజాల సురేందర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, హన్మంత్ షిండే పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

### నేడు కామారెడ్డికి కేటీఆర్ రాక

కామారెడ్డి,నవంబర్ 27 : కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నేపథ్యంలో మంగళవారం కామారెడ్డి పట్టణంలో రోడ్ షో నిర్వహించడానికి కేటీఆర్ రానున్నట్లు పార్టీ ప్రతినిధులు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

# కేసీఆర్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి

- సీఎం పోటీ చేయడం ఇక్కడి ప్రజల అదృష్టం
- రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- కామారెడ్డి జిల్లా కేంద్రంలో కార్నర్ మీటింగ్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మహమూద్ అలీ

కామారెడ్డి,నవంబర్ 27 : కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీలో సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ లాంటి వ్యక్తి కామారెడ్డిలో పోటీ చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించారని వివరించారు. కాళేశ్వరం ద్వారా సాగు నీటిని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించారన్నారు. ఇంత అభివృద్ధి చేసిన కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. కేసీఆర్‌ను కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా రూపుదిద్దుకుంటుందన్నారు. అంతే కాకుండా కామారెడ్డికి పరిశ్రమలు వస్తాయని,మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. రాష్ట్రంలో అనేక జి ల్లాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసి 9 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కేసీఆర్‌ను మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన పట్టణ వాసులు

### బీఆర్ఎస్ హయాంలోనే
# ముదిరాజ్‌లకు సముచిత స్థానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

- బీసీల గురించి ఆలోచన చేయనోళ్లు.. బీసీని సీఎం చేస్తారా?
- ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చేది బీఆర్ఎస్సే
- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

కామారెడ్డి,నవంబర్ 27 : బీఆర్ఎస్ హయాంలోనే ముదిరాజ్‌లకు సముచిత స్థానం లభించిందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నివాసం సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదిగేందుకు కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని అన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా తమకు ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నారు. సీఎం కేసీఆర్ తనకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారని రాబోయే రోజుల్లో మరిన్ని పదవులు కేటాయిస్తారన్నారు. 1970లో అప్పటి కేంద్ర ప్రభుత్వం బీసీ డీలోకి ముదిరాజ్‌లను మార్చిందని ఇప్పుడు బీసీ ఏలోకి మారుస్తామంటూ ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్ర రాజధానిలో ముదిరాజ్ సంఘ భవనానికి 5 ఎకరాల భూమి, రూ.5 కోట్ల నిధులు అందించి భవన నిర్మాణానికి సీఎం కేసీఆర్ సహకరించారని అన్నారు. బీసీలకు న్యాయం చేసేవిధంగా ఎన్నడూ ఆలోచన చేయని బీజేపీ కనీసం బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదని అన్నారు. అలాంటి తెలంగాణలో బీజేపీ వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకుడు మండలాల్లో కమ్యూనిటీ హాళ్లు, మందిరాలకు మెటీరియల్ అందిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాడని అన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్, ముదిరాజ్ నాయకుడు జగన్ పాల్గొన్నారు.